(జ్యోతి మాసపత్రిక; దీపావళి 1966)

22

సాయంత్రం ఆరు దాకా పరధ్యానంగా ఆఫీసులో కూచుని ఏదో పాత ఫైల్సు తెగ్గొట్టేస్తూ ఆనందం పొందుతూ ఉంటే ఎవరో వచ్చి అడిగారు; ఫలానా సినిమా చూసేరా, ఇవాళ ఆఖ్రరోజు సుమండీ అని. అప్పుడు జ్ఞాపకం వచ్చింది; ఊళ్ళో ఒక ప్రెసిడెంట్ ఎవార్డ్ సినిమా ఆడుతోందని. వెంటనే విశాలికి, సరాసరి ఫలానా సినిమాహాలు దగ్గిరకొచ్చెయ్యమని కబురుచేసేను. టిఫిన్ తిని హాలు దగ్గిరకెళ్ళేసరికి నాకన్నా ముందుగానే ఆవిడగారు అక్కడ చేరి చేటంత మొహంతో, మూడు వాట్ల బల్బులా వెలిగే కళ్ళతో, విశాల హాసంతో నన్ను ఆహ్వానిస్తోంది. అంత కులాసాకి కారణమేమిటో అడిగెయ్యాలనిపించింది. అడిగేస్తే 'ఆఁ, యేంలేదులెండి.' అనేసి మామూలుగా తయారయిపోతుందేమోనని భయంవేసి చిన్నబుచ్చుకుండానే కుశల ప్రశ్నలేసి కాలం గడిపేశాను. ఆ ప్రసన్నవదనం పదేపదే చూడబుద్ధేసింది. నలుగుర్లో ఉండిపోయామే, ప్రశంసించి అభినందించే అవకాశం జారిపోతోందే అని దిగులేసింది.

మత్తు వదిలింతరువాత తెలిసింది; ఈ వదనంలో పచ్చదనం అదనంగా రావడానికి కారణం కొత్తకొత్త నగలేవో మెళ్ళో మెరవడమేనని. మెళ్ళోనే కాదు; చేతులకీనూ, మెడలో పెడల్పాటి జాజిమొగ్గల నెక్లేసేకాక, చేతులు రెండింటికీ రెండేసి జతల గాజులు పెట్టుకొచ్చింది. ఎవరివో!....ఎంత చెప్పినా ఈ భారత స్త్రీలకి ఎరుపు నగలు పెట్టుకోడం, ఎరుపు చీరలు కట్టుకోడం, ఈ అలవాట్లు తప్పవు కాబోలు!....భారతస్త్రీ సంస్కృతిలో యివి ప్రత్యేక లక్షణాలుగా మిగిలిపోతాయి....ఏది ఏమైనా ఎరుపునగలు పెట్టుకుని అంతగా అంత మొహం చేసుకోవడం అనవసరం అనిపించింది.

సినిమా చూసేం. ఇంటికొచ్చేం. భోజనాలుకూడా కులాసాగా కబుర్లు చెప్పుకుంటూనే చేసేం. అయినా ఎరుపు నగలు ఎందుకు తెచ్చేవు, ఎవరివి; ఎరుపు నగల్తో అంత ఆనందం ఎలా పొందగలుగుతున్నావు—ఇలాంటి ప్రశ్నలు నేను వెయ్యలేదు, ఆవిడ తనంతట తాను ఈ విషయం ఎత్తకపోగా, అవి తన

శరీరంమీద ఉన్నాయన్న చైతన్యంవల్ల ఈ ఆనందం అనే విషయం చూపుల్లో కూడా సూచితం కాకుండా గడుసుగా జాగ్రత్తగా కాలం గడిపేసింది; కాని చివరికి ఓడిపోయింది.

వెనకటికి ఓ బంగారమ్మగారు రవ్వల ఉంగరం చేయించుకొని, మధ్యాహ్నంపూట కబుర్లకొచ్చిన అమ్మలక్కలు పులుసులూ కూరలూ సినిమాలూ పంపువగ్గిర తగాదాలూ మాట్లాడేసుకుంటూ ఉంగరం విషయం ఎవ్వరూ అడక్కపోతే, అబ్బా!ఉక్కపోస్తోంది;కాసేపుఈ రవ్వల ఉంగరం తీసేస్తానందిట అలా మా విశాలి రాత్రి పడుకోబోయేటప్పుడు;"ఇవితీసి పెట్లోదాచి తాళం వెయ్యండి; ఆరుబైట పడుకుంటాం కూడాను; ఎందుకేనా మంచిది!" అని అవన్నీ నాకిచ్చింది. అప్పుడేనా నేను 'ఎవరివి?' అనీ 'ఎందుకుతెచ్చే'వనీ, 'ఎరువు బరువుతో సరదాలు తీర్తాయా' అనీ అడుగుతానవి కాబోలు. నాకు తెలుసు ;"అవును మీరు చెప్పింది నిజం; ఎరువుతెస్తె సరదా తీరదు; కనక కరువుతీరా మీరే చేయించండి" అంటుందని. అందుకని మాట్లాడకుండావాటిని పెట్లోపెట్టేసి,తాళం వేసొచ్చి నా మంచం దగ్గిర కెళ్ళిపోతున్నాను.

"ఏమండీ—" అన్నది విశాలి గోముగా.

వెనక్కి తిరిగాను; తనే నాదగ్గరగా వొచ్చింది.

"బాగులేవాండీ, నెక్లెసూ అవీ?"

"ఎవరివవి?"

"ఎవరివో—బాగున్నాయో లేదో చెప్పమంటే!"

"ఎవరి వస్తువులమీదో మనభిప్రాయాలు చెప్పడం అంత మంచిది కాదేమో"?

"వాళ్ళతో చెప్పొద్దులెండి. ఏదో మన్లో మన మాట!"

"నువ్వు వాళ్ళతో చెప్పవని హామీ ఏమిటో?"

"చెబుదురూ! ఇంతట్లో మించిపోయిందేమీలేదు."

"సుందరమ్మగారివేనా?" అని అవతలి వాటావేపు వేలు చూపించేను. తల నిలువుగా ఆడించింది విశాల. "ఆ ఉన్న నగలు చాలవుటే ఆవిడకి. ఇంకా ఎన్ని మోస్తుందేమిటి?"

"అయనిష్టం, ఆవిడ అదృష్టమున్నూ. ఎలా ఉన్నాయో చెప్పండీ అంటే యీ కామెంట్లెందుకు?"

"బరువుగానే ఉన్నాయి. సేల్సుటాక్సు ఆఫీస్‌లోకదూ,అయనకుద్యోగం!"

"పోనీలెండి పాపం! ఏదో ఒక ఆఫీస్. అందరికీ మీ డిపార్టుమెంట్లోనే కావాలంటే వీలవుతుందా?"

"ఇహ అయినట్టేనా?" అని కదలబోయాను. చెయ్యి పట్టుకు ఆపింది.

"అదిగాదండీ, ఆ నెక్లెసూ, నాలుగు జతల గాజులూ అన్నీ కలిపి నాలుగు వందల యెనభై అటండీ."

"మంచి బంగారమేనా?"

"మరీ బావుందండీ. పట్టుకుని చూసినా తెలియలేదేమిటి? అచ్చం ఇరవై రెండు కేరట్ల బంగారమైతేనూ!"

"ఈవూళ్ళోనే చేయించేరా?"

"అఁ!"

"చేసిన పనివాడెవరో!"

"పనితనం బావుంది కదండీ. ఎవరో వీరభద్రమట. సినిమాహాల్ దగ్గిరె క్కడోట"

"రిపోర్టు చేస్తానని చెప్పు, మీ సుందరమ్మగారికి. తెలిసిందా! ఈయనా ఆయనాకూడా గవర్నమెంటుకి అతిథులుగా వెళ్ళిపోతారు. దేశంలో బంగారం నిలవ లెంతున్నాయో తెలీక గవర్నమెంటు చస్తూవుంటే, గవర్నమెంటు ఉద్యోగి అయిఉండి కూడా పెళ్ళానికి ఇరవై రెండు కేరట్ల బంగారంతో నగలు చేయిస్తాడా! చేసినవాడు ఏదో భుక్తి గడవక కూలికి కక్కుర్తి పడ్డాడే అనుకో! చదువుకున్నవాడుగదా; ఈయన బుద్దేమైందిట?" కోప్పడ్డాను.

"సరేలెండి—" బుంగమూతి పెట్టింది విశాలి,"మిమ్మల్ని కొనమంటానేమో అని ముందర కాళ్ళకి బందాలు వేస్తున్నారు...."

"నేనేం కొనవని చెప్పలేదే! పద్నాలుగు కేరట్లవి కావాలంటే నేను రెడీ—"

"చాల్లెండి, నిర్వాకం! ఎంతసేపూ పద్నాలుగు కారట్లు వస్తువులూ నల భయ్యో నెంబరు నూలుచీరలూ అంటూ కూచుంటారు...."

ఒక్కసారిగా ఆవేశం వచ్చింది. దేశం ఆర్థిక పరిస్థితి. గోల్డు స్టాండర్డు రిజర్వు బ్యాంకికీ బంగారపు నిలవలకి ఉండే అనుబంధం—ఈ విషయాలమీద ఉపన్యాసం యివ్వాలని. కాని అప్పటికే రాత్రయిపోయింది. తీక్షణంగా విశాలి

కళ్ళల్లోకి చూసేసి గట్టిగా ఊపిరి పీల్చేశాను. దాంతో నా అయిష్టం వ్యక్తమై పోతుందనుకొని.

కాని విశాలి మళ్ళా నెమ్మదిగా, గోముగా గొంతు మార్చుకుని అంది. "అంత డబ్బా ఒక్కసారే యిచ్చేయక్కర్లేదటండీ. మొదట నూరో నూట యాభయ్యో ఇచ్చి ఆ తరువాత నెలకింతా అని ఇవ్వొచ్చుట. అలా ఇచ్చేటట్టు ఏర్పాటు చేస్తానందండీ రుక్మిణమ్మగారు."

"ఓహో, ఇందులో ఈవిడగారు కూడా ఉందన్నమాట. హుం! పిచ్చి పిచ్చి వేషాలు మానేసి తెచ్చినవి తెచ్చినట్టిచ్చేయ్ ఎరువు సొమ్ము బరువు చేటు——" అనేసి గబగబా వెళ్ళాను.

రుక్మిణమ్మగారిని, మా యింటావిడ—అదే. మా యింటిగలావిడే అనుకోండి——పంధొమ్మిది వందల ముప్ఫయిరెండులో అనగా ఆవిడకి పన్నెండేళ్ళప్పుడు పెళ్ళయింది; మరుసటేడే, అనగా ఆవిడికి పదమూడేళ్ళప్పుడే ఆయన పోయారుట. అప్పట్నించీ ఆవిడ తను ఓ గదిలో ఉండి. మిగతా యింటికి రెండు వాటాలు చేసి అద్దెకిచ్చి కాలక్షేపం చేస్తూంది. మొగుడు పోయినాక కొద్దిగా చదువుకొని పంతులమ్మైంది. ఆవిడికీ మా విశాలికీ అంత స్నేహం అయిపోవడ చిత్రం బదిలీ అయినప్పుడు క్షణమేనా ఆగకుండా వొచ్చి జాయిన్ కావలసొచ్చింధి. సరే. ఏ సత్రంలోనైనా దిగుదాంలే అని. ఎకాయెకీ సతీమణితో సామానుతో సహా వొచ్చేశాను. ఆఖరురైల్లో ఆవిడా మేమూ వో కంపార్ట్మెంట్లో యెక్కాం. అంతే. యిహ సత్రమూ లేదు, సన్యాసమూ లేదు. "కొత్తగా మా వూరికి బదిలీ ఐ వొస్తున్నారా అమ్మడూ" అని ఆవిడ ముచ్చట పడడమూ;

"ఇల్లేనా చూసుగోకుండా వొచ్చేస్తున్నా మండీ" అని యీవిడ దిగులు పడ్డమూ.

"చూసుకోకపోతే యేంలే అమ్మా, మా యింట్లో వో వాటా ఖాళీగా వుందమ్మా" అని ఆవిడ అర్ధోక్తిలో ఆగడమూ

దాంతరువాత యీవిడ అర్ధ గర్విఠంగా నావేపు ఓసారి చూడ్డంతప్ప వేరే యేం అనకపోవడం,

ఆవిడ గడుసుగా నవ్వేసి "మాలాంటి వాళ్ళెళ్ళలో మీరుందరు

గాబోల్లెండి" అని తను నొచ్చుకున్నట్లు తెలియకుండా యీనిణ్ణి మెల్లిగా వొప్పించడం.

అంతలో యీవిడ యిదైపోయి, "అయ్యో ఎంతమాటన్నారు! వెళ్ళగానే మీ యిల్లు చూసి గాని యింకెక్కడా అద్దిళ్ళ కోసం బోగట్టా చెయ్యంలెండి" అని హామీ యివ్వడం.

ఆలా అలా, మేం స్టేషన్నించి సరాసరి వాళ్ళింటికే వెళ్ళి అక్కడే ఈ ఎనిమిది నెల్ల బట్టీ సద్దుకుని వుండిపోవడం వరకూ వచ్చింది.

ఆ నాట్నించీ విశాలి; యిటు నా భార్యగా ఉండవలసిన బాధ్యతొకటి తననెత్తిమీదుంచుకునీ కూడా. అటు అవిడ స్నేహంతో మత్తెక్కిపోయి. వొక్కమాటలో చెప్పాలంటే-పిలిస్తే పలక్కుండా తయారైందనుకోండి. అవిడతో బజార్లు షికార్లు చెలాయిస్తుంది. కూర్లెంచుకోడాల దగ్గిర మొదలెట్టి చీర్లెంచుకోడాల దాకా వొచ్చింది. వంటలూ వార్పుల్లో సాయం చేసుకోడాల దగ్గిర్నుంచీ యక్స్పెరిమెంట్లు చేయించడం వరకూ నడిచింది. తలంట్లూ అవీ తటస్తపడ్డప్పుడు పులుసులు పోసుకోడాల దగ్గిర్నుంచి ఆ తలుపుల్లేని బాత్రూమ్‌కి కాపలా వుండడాల వరకూ వెళ్ళి వీపులు రుద్దుకోడాల దాకాసాగింది. ఆ బాత్ రూమ్ నించి యీ పడగ్గది వరకూ బాతాఖానీలు నిరాటంకంగా నిరవధికంగా సాగుతాయి. పైగా యిల్లు చిన్నది గదూ (ఆమాటంటేనే, మా ఆవిడకోపం ముంచుకొస్తుంది) ఎవరెక్కణ్ణించి మాట్లాడినా అందరికీ వినిపిస్తుంది. గోడల మీంచీ తడికెలమీంచీ మాట్లాడేసుకోవడం, అర్ధరాత్రయి దీపాలార్పేసుకు మంచాలమీద చేరినాకూడా చీకటి గదుల్లోంచి చిన్నమెత్తు విలువచెయ్యని చిన్న చిన్న విషయాలమీద చేట భారతాలు చెరిగిపొయ్యడం. విసుగుపుడ్తుంది. రెండు మూడు సార్లు "ఏమే ఈ యిల్లు చాలడంలేదే; ఎక్కడికేనా మారిపోదామే" అని నేను సూచిస్తే కూడా "ఎందుకు లెద్దురూ, చిన్న ఇల్లయినా ఏదో సర్దుకుంటున్నాంగా" అని సద్దేసేది.

ఏం కూర లొండుకోవడం అనే విషయం దగ్గిర్నుంచీ పక్క లెక్కడ వేసుకోవడం అనే సమస్య వరకూ ఆవిడ సలహాలు ఇవ్వకా మానదు; ఈవిడ అడక్కా మానదు. అదేమిటమ్మా చిలకా గోరింకల్లాగ యిద్దరున్నప్పుడే ఒళ్ళు పచ్చగా యింత బంగారం పెట్టుకోవాలిగాని ఆనక నలుగురైదుగురు పుట్టాక చేయించుకుందాం అనుకుంటే మాత్రం అవుతుందా? అని మా విశాలిని

ఆవిడే పురికొల్పింది. ఒకటి రెండుసార్లు నాతోనే అంది కూడాను—బంగారం ఎలాగేనా కొనుక్కోవాలన్న ఈ పట్టుదల విశాలి కల్గడానికి కారణం ఈవిడ ప్రోద్బలమే! ఇలాంటి నగలు తనకీ చేయించమని పీకలమీద కూచుం టుంది కాబోలు ఈవిడ.

చివరికి ఈవిడ మా సంసారంలో చీదర ప్రవేశ పెట్టడానికి ఉద్యమించిం దన్నమాట. ఎనిమిదేళ్ళయింది మాకు పెళ్ళయి. ఎప్పుడూ దేని విషయం కూడా మేం రెండు మాటలనుకోలేదు. అన్లేదు. చివరికి ఈవిడద్వారా ఈ రకం అనుభవాలు కూడా ప్రాప్తమౌతాయని స్ఫురించి భయం కలుగుతోంది.

ఇంకో యింట్లోకి మారిపోవాలి. తప్పదు.

విశాలి ఇంటికీ తాళం వేసొచ్చి పక్కమంచమీద పడుకుంది. అందరూ ఆరుబైట మంచా లేసుకున్నారు. నా కివతల పక్క మా కమర్షియల్ టా క్సాఫీసు రాక్షసుడు. ఆయన కవతల సుందరమ్మ అనేపేరు గల బంగారపు హిడింబి. ఆవిడ కవతల రెండు మంచాలమీద వాళ్ళ నలుగురు పిల్లలూ. నాకు రెండోవెపు మా విశాలి. అవతలగా మా యింటి గలావిడ, ఇంకా అవ తల ఈ ఊళ్ళోనే రికామీగా తిరుగుతున్న ఆవిడ పింతల్లి కొడుకూ. వాళ్ళందరూ మేం సినిమా నుం చొచ్చేలోగా ఒక నిద్ర తీసినవాళ్ళే. మేం రావడం, భోజనాలు చెయ్యడం ఈ హడావుడికి మెలకువ లొచ్చేయి గాబోలు. మళ్ళా కబుర్లకి లంకించుకున్నారు. వరసగా తీవ్రంగా కాకపోయినా అప్పుడో మాటా అప్పుడో మాటగాఅనుకుంటున్నారు. నేను వాళ్ళతో ఎక్కువగా మాట్లాడనని వాళ్ళ కందరికీ తెలుసు. అంచేత పలకరించలేదు. విశాలి రాగానే వాళ్ళు సినిమా ఏమిటి ఎలా వుందన్న నెపంతో సంభాషణ ప్రారంభించి నగ లెల్లా ఉన్నా యన్నారు మీ ఆయన? అని అడిగేసి. మరి మీకు చేయించడం మా టేమన్నారు అని పంచాయితీ చేస్తారేమో, వాళ్ళతో ఎలా యుద్ధం చెయ్యడమని ఎప్పుడో చదివిన ఎకనామిక్స్ పాఠాలు గుర్తుతెచ్చుకుంటున్నాను.

ఏదో పనిమీద ఈ వూరొచ్చి మూడు రోజులుండి, అప్పుడే వెళ్ళి పోయాడు రాధా కృష్ణమూర్తి. వెళ్తూవెళ్తూ వాడాడిన మాటలు వింటూవుంటే నాకు విశాలిమీద చాలా కోపం వచ్చింది. "ఒరే హోటల్లో దిగితే యేడుస్తావని మీ యింటికొచ్చినందుకు మా బాగా చేసేవురా. ఈమా రొచ్చినప్పుడు

హోటల్లో దిగుతాన్లే. బుద్ధొచ్చింది" అన్నాడు. "ఇల్లు కొంచెం యిరుకే అనుకో; కాని మాకు సరిపోతుందిగదుట్రా!" అని అప్రయత్నంగా విశాలిని సమర్ధించేను "పోరా! ఇల్లు మార్చాలని నీకున్నా ఆవిడ మార్చనిస్తుందేమిటి? నేనంతాచూస్సేన్లేరా!" అనేశాడు. మూడు రోజులూ వాడు సణుగుతూనే ఉన్నాడుగాని నేనట్టే పట్టించుకోలేదు; పైగా మేమిద్దరం కలిసి విశాలితో వాదించి ఈ విషయంలో వో మంచి నిర్ణయానికి రాగలిగిన అవకాశం చేతులారా జారవిడిచేను. ఓ పూట మావాడేదో సణుగుతూ వుంటే విన్నట్టుంది, విశాలి: "అన్నగారు మాకీ యిల్లు చాలదని యిదవుతున్నట్టుంది. పెద్దలు చెప్పినట్లు ఆలిమర్కటం యెలాగూ చెయ్యలేకపోయారు మీ ఫ్రెండు; అందుకని యిల్లు చిన్నది తీసుకున్నార్లెండి. అయినా పదిమంది ఒచ్చి పోయీ సంసారం కాదుగదండీ. ఏదో సర్దుకుపోతున్నాం" అని వో చిన్న భాషణ నిరోధక ఉపన్యాసం యిచ్చేసి, వాడిచేత "దానికేముందిలెండి. మీది బాగా ఎడ్జస్టె మెంటాలిటీ. దాని ప్రభావమే యిది" అనిపించుకొని. నావేపు గర్వంగా చూసేసింది.

"విశాలీ! నేను వేరే యిల్లు చూసుకుంటున్నాను. ఇంచక్కా నువ్వూ మీ రుక్మిణమ్మగారూ యిందులో చిలకా గోరింకల్లా కలకాలం కాపరం చెయ్యండి. ఇదే ఆశీర్వదిస్తున్నాను. నీకేమో, పుత్రపౌత్రాభివృద్ధిరస్తు; ఆవిడకేమో దీర్ఘ సుమంగళీ భవ!"

"స్ స్స! ఊరుకోండీ. ఆవిడింట్లోనే ఉంది కూడానూ. వినబడగల్దు!"

"వినబడితే? నాకేం. ఇంక్రిమెంటు స్టాప్ చేస్తుందా?"

"చాల్చాల్లెండీ. ఏమిటా మాటలు? ఆవిణ్ణి పట్టుకొని దీర్ఘ సుమంగళీ అనొచ్చండీ మీరు?, పాపం, ఆవిణ్ణి భగవంతుడు తిన్నగా చూసేడు కాదుగనక ఆవిడ ఖర్మ అలా అయిపోయిందిగానీ——" అని ఆవిడ తరపున విశాలి ఏకంగా కంటతడి పెట్టుకోడానికే సిద్ధమైపోయింది.

మళ్ళీ ఆరాత్రి తనే సంభాషణ ప్రారంభించింది.

"అన్నిటికీ ఇమ్మగా వుంది సుమండీ ఈ యిల్లు. అద్దె తక్కువ. మీరే చెప్పండి; నెలకి యాభయ్యో, అరవయ్యో పోసి పెద్ద బంగళాలోకి వెళిపోతే మాత్రం డబ్బు దండుగ తప్ప ఏమేనావుందీ?—— ఇంతకూ మీకు జీతంలో

విశాలి నింపాదిగా "నేనేం చూడఖ్ఖర్లేదు" అంది.

"అంటే నేనే ఏదో యిల్లు చూసొచ్చేక, ప్రవేశించిన మర్నాట్నుంచీ ఈ యిల్లు నాకు నచ్చలేదండీ అని రోజూ పోరు పెడదామని గాబోలు నీ ఉద్దేశం. అదేం కుదర్దు." అన్నాను: యుద్ధానికి సిద్ధమైన వాళ్ళాగ.

"మనం ఈ ఇంట్లోంచి ఇంత వేగం మారిపోవటానికి వీల్లేదండీ." అంది విశాలి; నా ఆవేశం ఏమీ పంచుకోకుండా.

"ఏం మూఢమి వుందా?" తీవ్రంగా అని, మంచంమీద వాలాను.

"మీరు అయిదు నిమషాలు శాంతంగా ఉంటే నేను మాట్లాడతాను." అని విశాలి లేచింది. బావిదగ్గర కెళ్ళింది, అనవసరంగా కాళ్ళూచేతులూ మొహం కడుక్కుంది. కాలయాపన చెయ్యడానికని తెలుస్తూనే ఉంది. ఇంట్లోకొచ్చి అద్దం దగ్గిర చేరి ముస్తాబు చేసుకోడం మొదలెట్టింది.

నేను నిశ్శబ్దంగా ఉండగలిగాను; కాని ఒక్కసారిగా 'శాంతం' రాలేదు. ఈ యింటిలో ఉండడానికి విశాలికి ఎందుకు పట్టుదలగా ఉండి ఉండవచ్చు? బహుశా సుందరమ్మగారూ రుక్మిణమ్మగారూ తనకి మంచి సహవాసస్తురాళ్ళుగా ఉండి వున్నారేమో. ఇరుగూ పొరుగులను ఆ దృష్టితో చూస్తే అవి చాలా అవసరమైనవే. అయితే చాలా స్వల్పమైన విలువ; అల్పమైన తాత్కాలికమైన అనుబంధం. ఏ యింటికి వెళ్ళినా ఈ మాత్రం స్నేహితురాళ్ళని సుళువుగా సంపాదించుకోవచ్చును. ఇంతకీ ఏమంత విదుషీమణులు, ఈ మహిళలు! ఒకావిడకి తన భర్తనీ అతని వుద్యోగాన్నీ చూసి గర్వం; రెండో ఆవిడకి తన భర్త లేకపోడం, తన ఉద్యోగం చూసి గర్వం కాబోలు. నాకే అర్థం కావటం లేదా? ఒకవేళ విశాలివీ, వాళ్ళవీ అభిరుచులు సరిపోయి స్నేహం తియ్యగా వుందేమో! ఏమి అభిరుచులు! పురాణాలు మెచ్చుతారు. పౌరాణిక నాయకుల్లా సత్యకాలంగా ప్రవర్తించే భర్తలు నచ్చరు. సాహసంతో సంస్కార పంథా తొక్కిన నవలల్లోని పాత్రలు చూసి ఆనందిస్తారు. పొరుగింటి అబ్బాయో, అమ్మాయో అలాటి పనేదైనా చేస్తే బుగ్గలు నొక్కుకుని చెవులు కొరుక్కుంటారు. సినిమాలు చూసి మెచ్చుతారు. అలా డ్రెస్ చేసుకున్న వాళ్ళనీ అలా మాట్లాడే వాళ్ళనీ చూసి మెటికలు విరుస్తారు....ఇలాంటి నేలబారు అభిరుచులు కలిగిన వాళ్ళని ఒక్క దగ్గర వదిలిపెడ్తే సంఘర్షణ తటస్థించదు. ప్రగతికి అవకాశమే లేదు. పరస్పర

ప్రశంసల వల్ల స్నేహాలు బలపడతాయి. ఈ సామాన్య సంసార నాయికలు ఒక రొకరు ప్రశంసించుకోడానికి వీళ్ళకున్న చరిత్రేమిటి? సంఘానికి వీళ్ళు చేసిన సేవేమిటి? భర్తలమీదా, పిల్లలమీదా గొప్పలు చెప్పుకుంటారు. మా ఆయన ఇంత డబ్బు సంపాదిస్తున్నాడంటే మా పిల్లలు అంతంత బుద్ధిమంతులని, మా ఆయన బంగారం కొన్నారంటే మా ఆయనే బంగారం అనీనూ.

"ఏమిటండీ ఆలోచిస్తున్నారు?" అంది విశాలి, నా పక్కనొచ్చి పడుకొని.

"ఏం లేదు." నేనటు తిరగలేదు. మా యిద్దరి మధ్యా యెక్కువ ఖాళీలేదు. అందుకని ఎడంగా జరిగేను. "తల ఎత్తయి పోయిం" దంటూ వొక దిండు తీసి యిద్దరి మధ్యా వేసేను.

"దిండు కాదు వెయ్యడం, కత్తి వెయ్యాలి. అప్పుడు భర్తృహరి చెప్పి నంత గొప్పవారవుతారు మీరు." విశాలి ఎగతాళిగా నవ్వి, ఇంతసేపూ నావేపు తిరిగున్నదల్లా, అటు తిరిగిపోయింది,

కొంతసేపు నేను మాట్లాడలేదు.

"నామీద కోపం పోయిందాండి?"

"నీమీద కోపం నాకెందుకూ?"

"ఊఁహూఁ !....అంటే కోపం పోలేదన్నమాటే. అయినా మీరు 'కోపం లేదంటున్నారు కనక, నే నడిగినదానికల్లా సమాధానాలు చెప్తారా?....అంటే నే నడిగేదాన్నీ మీరు చెప్పేవాళ్ళు అన్న దృష్టితో కాదనుకోండీ——" అదొక రకం గడుసుతనం: దభాయిస్తూనే, బ్రతిమాలుకుంటున్నట్టు స్వరం పోసుకోడం: ఆ మాటలూ అలాంటివే వుపయోగించడం.

"అడుగుమా!"అన్నాను,వినుకుంటున్నట్టు, కుతూహలం తెలియకుండా వుండడానికి.

"మనం ఈ యింటి కొచ్చి ఎన్నాళ్ళయింధండీ?"

"ఎనిమిది నెల్లూ!"

"ఎనిమి దిరవయ్యయిదు లెంత ?"

"రెండు పందలు!" అబ్బా! రుక్మిణమ్మ గారికి మా మూలంగా రెండు వందలు ముట్టాయన్నమాట!

"ఆర్నెల్ల కిందట మా తమ్ముడొచ్చాడు మీకు జ్ఞాపకం ఉందా?"

"ఉందీ!"

మా తమ్ముడు మనకెంత ఇవ్వాలి?"

"నూట యెనభై !"

"మొత్తం ఎంతయింది ?"

"నీకేమైనా మతిగాని పోయిందేమిటి విశాలీ! రుక్మిణమ్మగారికి అద్దెకింద నెల్నెలా యిచ్చిన అద్దెనూ, మీ తమ్ముడు నాలుగేళ్ళ బట్టీ ఇదుగో ఇస్తానదుగో ఇస్తానని తిప్పుతున్న సొమ్మూ మొత్తమేమిటే?" అని యిటు తిరిగాను.

విశాలి నావేపు తిరిగి ఒక్క క్షణం చూపు కలిపి, మా మధ్య ఉన్న దిండు మొహానికి అడ్డం పెట్టుకుని అల్లరిగా నవ్వుతూ "అవునండీ. రెండూ మొత్తం చేసేను" అంది.

"అంటే?"

"చెప్పుకోవాలి."

"నెల్నెలా ఇంటావిడకి అద్దె యివ్వడం లేదుటే ?"

"మీ రిచ్చేరు, నేను పుచ్చుకున్నాను."

"మీ తమ్ముడు ఆ డబ్బు నీ చేతికి ఇచ్చేసేడు కూడానా ?"

"ఆఁ !"

"అదీ ఇదీ కలిపి నువ్వు బంగారంకాని కొన్లేదు గద!"

".... ...."

"మాట్లాడవేమే?"

".... ...."

దిండు అడ్డం తీశాను. మొహంమీద రెండు చేతులూ కప్పుకుని దొంగ చూపు చూస్తోంది.... "మీరు .... కొనుక్కోమన్నారు కదండీ?"

"నేనా?"

"ఇప్పుడు కాదులెండీ. మనం కాకినాడలో ఉన్నప్పుడు మా అమ్మ మనింటికొస్తే" అంది.

అత్తగారు అడిగింది: ఏమయ్యా ఇలా డబ్బు బ్యాంకిలో వేసే బదులు ముచ్చటకేనా ఒకటో, రెండో వస్తువులు చేయించరాదుటయ్యా అని. "మిగుల్చు

కుని దాచుకొని కొనుక్కోపసనండీ. నే వద్దన్నానా !" అనో యేదో, అప్పటి కెయ్యది ప్రస్తుతమో- చెప్పినట్టున్నాను.

నేను మంచమ్మీద లేచి కూర్చున్నాను. "అంచేత? నువ్వు నా కళ్ళుగప్పి బంగారం కొంటావా! ఎంత తెగింపు; మీ తమ్ముడిచ్చింది తీసుకుని ఎలాగో వాడి నోరు మూశావు బాగానే ఉంది. కాని ఇంటావిడకి ప్రతినెలా నేనే స్వయంగా నా చేత్తో ఇస్తున్నానే, అదెలా తీసుకుంటున్నావే!"

"మీరే అంటారు కదండీ. ఇష్టం ఉంటే మార్గం ఉంటుందని!"

"ఔనౌను." అన్నాను గట్టిగా. "వస్తువులు చేయించుకో మన్నానే అనుకో, దేశంలో నలుగురూ ఎలా చేస్తున్నారో చూసుకుని నువ్వు పధ్నాలుగు కారెట్ల వస్తువులు చేయించుకోవలసింది!"

"ఇంకా నయం ! ఇత్తడివో, గిల్టువో పెట్టుకోమన్నారు కాదు."

"గిల్టువీ, పధ్నాలుగు కారెట్లవీ ఒకటేనా ఏమిటి ! ఎందుకు అడ్డదిడ్డగాం మాట్లాడతావు ?"

"ఇంకా ఆ మాటకొస్తే గిల్టువే నయం! ఈ పధ్నాలుక్కారెట్ల వస్తువులు పెట్టుకుంటే వొళ్ళంతా మంటలుట ! మొన్ననొకావిడ చూపించింది: పాపం, మెడమీదా గుండెలమీదా ఎర్రెర్రగా పెద్ద పెద్ద మచ్చలు పడ్డాయి.....ఒకటే దురదలట, ఆ మచ్చలు పడ్డ చోటల్లాను. అదంతా రాగి ఎక్కువగా కలపడం వల్లేనుట !"

"ఇలాంటి కాశీమజిలీ కథలు నా దగ్గిర చెప్పకు.... సరే. జరిగిందేదో జరిగింది. రేపు పొద్దుటే లేచి ఆ వస్తువులు మర్యాదగా నా కప్పచెప్పు... నాకు విరుద్ధంగా నువ్వు చేసిందంతా ఎలాగో సర్దుకుందాంగాని, చట్టానికి విరుద్ధంగా నువ్వు చేసిందాన్ని క్షమించడానికి నాకు పవర్సు లేవు. ఆ ఇరవై రెండు కారెట్ల బంగారం స్టేట్ బ్యాంకి ద్వారా గవర్నమెంటు పరం చెయ్యవలసిందేను."

ఎంత ప్లాను! రుక్మిణమ్మగారి డబ్బు తరవాత ఎప్పుడో నెలకింతా అని యిచ్చేటట్టు ఒప్పందమట. మొత్తం పడ్డది మూడువందలు. నెలకి ఇరవయ్యో, పాతికో యిమ్మందిట. నాకు తెలిసిపోయిన తర్వాత ఎంత ఇవ్వాలో, ఎలా ఇవ్వాలో నేనే చూసుకుంటానని ధైర్యమట....అందుకని ఆవిడకి నమ్మకం ఉండ

డానికి వీలుగా, మేం ఆ అప్పు తీరేదాకా ఈ ఇంట్లోనే ఉండాలట. పైగా, మాకు ఆ మాత్రం సాయం చేసినందుకు తనకి ఈ మాత్రం సాయం చెయ్యాలా అని- మేం వెళ్ళిపోతే ఈ ఇంటికి మళ్ళీ ఎలాంటి వాళ్ళొస్తారో- అద్దె తిన్నగా ఇస్తారో ఇవ్వరో, రాత్రీ పగలూ ఎలాంటెలాంటి మనుషులు ఎలాంటెలాంటి జులుం చేస్తారో- ఇలా భయపడి చాలా ఇదైందిట-

"ఆల్‌రైట్. ఆవిడ అప్పురేపే బ్యాంకులోంచి డ్రా చేసి తెచ్చి మొహమ్మీద కొట్టాను. వడ్డీకూడా కావాలంటే ఇద్దాం, కాని రెండు షరతులు. ఒకటి. ఇలాంటి ఇంటిలో మనం ఒక్క రోజుకూడా ఉండడానికి మాత్రం వీల్లేదు, రెండు: చట్టానికి వ్యతిరేకంగా నా కస్టడీలో, అంటే నీ దగ్గిర; ఇరవై రెండు కేరట్ల బంగారం ఉండడానికి అసలే వీల్లేదు. రేపే పట్టుకెళ్ళి స్టేట్ బ్యాంక్‌లో."

విశాలి హఠాత్తుగా మంచందిగింది. "ఏమిటండీ, మీ చట్టాలూ మీరూనూ; నాకర్థం కాలేదు!... నేను ఏ ప్రభుత్వానికీ, ఏ చట్టానికీ వెరవను. మీకు విరుద్ధంగా చేసిందే మీరు క్షమించేనన్నారు నాకదేచాలు, నేను మీకు జడవాలిగాని ప్రభుత్వానికి నేనెందుకు జడుస్తాను?..." అని పెట్టె తెరిచి, తక్షణం నెక్లెసూ, గాజులూ తగిలించేసుకుంది. "మీరు ఒప్పుకున్నారుగనక ఈ క్షణంనించీ ఇవి నావి. ఒంటిమీదున్న బంగారం తీసేసుకోమని ఏ చట్టంలో వుందో ఆ చట్టం చేసినవాణ్ని రమ్మనండి!" అంది; మేమిద్దరం ఓపార్టీ అయిపోయినట్టూ తనతోబాటుగా నేను గోల్డ్ కంట్రోల్ యాక్ట్‌ని వ్యతిరేకించడానికి సిద్ధమని తనకి తెలిసిపోయినట్టూనూ.

*　　　　*　　　　*

పొద్దుట కాఫీతాగాక, కాసేపు ద్వైధీభావంలో పడ్డాను. చట్టానికి వ్యతిరేకంగా ఈ నగలు నా ఇంటిలో వుండడం భారత పౌరుడిగా నా బాధ్యతను నేను సరిగ్గా నిర్వర్తించ లేదనడానికి ఒక ఉదాహరణ. అయితే ఒంటిమీదున్న బంగారం తీసుకోమని ఏ చట్టంలో ఉందో, ఆ చట్టం చేసినవాణ్ని రమ్మనండి; అనే సవాలు కూడా బలంగానే ఉన్నట్టుంది. కొన్ని రకాల చీదరలు, వాటిని ఒదుల్చుకోవాలని ప్రయత్నించి ఫలితాలు అనుభవించటంకంటె ఆ చీదరలే భరించడం సుళువు. చివరికి ఒక నిశ్చయానికి త్వరగానే వచ్చాను. ఆ వస్తువులు తీసుకెళ్ళి స్టేట్‌బ్యాంక్ ఏజెంటు నడగాలి. అవి ఎలా, ఎవరికి, ఎక్కడ ఒప్ప

గిస్తే నేరం తప్పుతుందో అసలు పద్ధతేమిటో....! విశాలికోసం చూశాను. ఏదో మంత్రాంగం కోసం పక్కవాటాలో కెళ్ళినట్టుంది, కేకేశాను.

గల గల్లాడుతూ వచ్చింది విశాలి. మొహం కలకల్లాడుతోంది. ఒళ్ళంతా మిలమిల్లాడుతోంది. సంతోషం రెండు రెట్లయినట్టుంది. కారణమేమిటో!

"పాపం ఆడప్రాణం గనక, ఆడవాళ్ళ కష్టసుఖాలు గుర్తుంచుకుంది. మహనీయురాలు!" అని చేతిలో వార్తాపత్రిక నా చేతికిచ్చి, రెండు చేతులూ నడుముకి రెండు వేపులా మడిచిపెట్టుకుని "ఇప్పుడేమంటారు" అన్న ప్రశ్న కనుబొమ లెగరేస్తూ అడక్కుండా అడిగింది.

పేపరు తెరిచాను. " ఇరవై రెండు క్యారట్ల బంగారంతోనగలతయారీకి ప్రధాని అనుమతి"

కాసేపు గోల్డ్‌కంట్రోలు యాక్టు సంస్మరణార్థం మౌనం వహించాను.

బజారు కెళ్ళబోతూ గుమ్మం దాటేను. "బజార్లో క్యారట్లు దొరుకుతే తీసుకురండీ. మాంచి ఇరవై రెండు క్యారట్ల హల్వా చేసి పెడతాను. తిందురు గాని!" అని విశాలి కేకేసినట్టయింది.

*